'అనంత' కష్టం C/o ప్లాట్‌ఫాం!

'ప్రయాణికుల రద్దీకి తగ్గట్టు బస్సులు నడుపుతాం.. అవసరమైతే అదనంగా బస్సుల సంఖ్య పెంచి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తాం..' ఇదీ స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవం సమయంలో ఆర్టీసీ అధికారుల చెప్పిన మాట. అంతే కాకుండా మహిళా ప్రయాణికుల రద్దీ దృష్ట్యా అదనంగా సౌకర్యాలు కల్పిస్తామని గొప్పగా ప్రకటించారు. అయితే ఉచిత బస్సు సంగతేమోగాని తమకు ఉచితంగా కష్టాలు వచ్చిపడ్డాయని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులు భారీగా కేటాయించడంతో మహిళలతోపాటు సాధారణ ప్రయాణికులు నానా తిప్పలు పడాల్సి వచ్చింది. బస్టాండ్ సెంటర్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపిస్తోంది.

- రెండో రోజూ కొనసాగిన ప్రయాణికుల 'అనంత' కష్టాలు
- డిపోలు, బస్టాండ్లలో కిక్కిరిసిన ప్రయాణికులు
- బస్సులు తగినన్ని లేక ఆటోలను ఆశ్రయించిన వైనం


ప్రయాణికులతో కిటకిటలాడుతున్న పొదిలి ఆర్టీసీ డిపో

పొదిలి/కొనకనమిట్ల: నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పొదిలి ఆర్టీసీ డిపో బుధవారం బస్సు ల్లేక వెలవెలబోయింది. జిల్లా నడికూడలి కావడంతో పొదిలి డిపో ఎప్పుడూ బస్సులు, ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. బుధవారం మాత్రం బస్టాండ్‌లో బంద్ వాతావరణం కనిపించింది. కారణం అన్ని డిపోల నుంచి బస్సులను అనంతపురం పంపించడమే. స్థానిక డిపో బస్సులతోపాటు కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, అద్దంకి, ఒంగోలు తదితర డిపోల నుంచి శ్రీశైలం, కర్నూలు, రాయచూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులు పొదిలి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే అనంతపురంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ఏర్పాటు చేసిన సభ గత రెండు రోజులుగా ప్రయాణికులకు కష్టాలు తెచ్చిపెట్టింది. గురువారం కూడా ఇదే పరిస్థితి ఉంటుందని ఆర్టీసీ సిబ్బంది చెబుతున్న మాట. డిపోకు వస్తున్న ఒకటీ అరా బస్సుల్లో వృద్ధులు ఎక్కలేకపోయారు. రద్దీని తట్టుకుని చంటి పిల్లలతో ఉన్న మహిళలు బస్సులు ఎక్కేందుకు వీలులేకుండా పోయింది. డిపో నుంచి 26 బస్సులను అనంతపురం పంపించామని చెబుతున్న అధికారులు దానికి అనుగుణంగా ప్రత్యమ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై ప్రయాణికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

రద్దీకి తగ్గట్టు బస్సులేవి?

కొనకనమిట్ల మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రధాన రహదారులైన ఒంగోలు–గిద్దలూరు, పొదిలి–కనిగిరి, పొదిలి–మార్కాపురం, పొదిలి–దర్శి రూట్లలోనే బస్సులు నడుస్తున్నాయి. ఆయా రూట్లలో ఉన్న గ్రామాలైన గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల, చినారికట్ల బస్టాండ్ సెంటర్లలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగుతాయి. పల్లెవెలుగు బస్సులు మాత్రం ఉదయం పొదిలి–గుడిపాటిపల్లి, నాయుడుపేట, దొనకొండ, వెలిగండ్ల, గనివానిపాడు వరకు, మార్కాపురం–గొట్లగట్టు వరకు నడుస్తాయి. మధ్యలో ఇక బస్సులు ఉండవు. స్టేజీ ఉన్న గ్రామాల వారికే ఎక్స్‌ప్రెస్ బస్ సౌకర్యం ఉంది. మిగతా ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించక తప్పదు. రూరల్ గ్రామాలకు తిప్పాల్సిన పల్లె వెలుగు బస్సులను కూడా పట్టణాలకు నడుపుతండటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

బస్సులే లేవు.. ఇక ఉచితమెలా?

గిద్దలూరు డిపో నుంచి ఒంగోలుకు ఎక్కువ శాతం ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్‌లు తిప్పుతున్నారు. డీలక్స్, లగ్జరీ బస్‌లకు మహిళలకు ఉచిత బస్ సౌకర్యం లేకపోవడంతో ఎక్స్ ప్రెస్ సర్వీస్‌లకు రద్దీ ఎక్కువగా ఉంటోంది. పొదిలి నుంచి ఒంగోలు, దర్శి, కనిగిరి, అద్దంకి వెళ్లటానికి పల్లె వెలుగు బస్‌లు ఉన్నప్పటికీ పశ్చిమ ప్రాంతం నుంచి వచ్చే ప్రయాణికులు లగ్జరీ, డీలక్స్ బస్‌లలో టికెట్ తీసుకుని పొదిలి వరకు ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రద్దీ తగ్గాలంటే అధికారులు స్పందించి ప్రధాన రూట్లలో ఉన్న బస్‌లకు అదనంగా అన్ని స్టేజీల్లో ఆగేలా పల్లె వెలుగు సర్వీసులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పొదిలి డిపోలో బస్సులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న ప్లాట్‌ఫాంలు


మార్కాపురం డిపోలో బస్సుల కోసం ప్రయాణికుల ఎదురు చూపులు


బస్‌లు లేక గొట్లగట్టు నుంచి ఆటోలో వెళ్తున్న మహిళలు

క్లుప్తంగా

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

- డీఎల్‌డీఓ బాలూనాయక్

మార్కాపురం: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసరు బాలూనాయక్ అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ చిరంజీవి, ఏడీఏ బాలాజీ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉప్పలపాడు పీహెచ్‌సీ తనిఖీ

పొదిలి రూరల్: మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ జి.శోభన్‌బాబు తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రిలోని రికార్డులు, స్టాక్, వాక్సిన్, లేబర్ రూమ్, రోగుల వార్డులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యసేవల తీరు తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రి నిర్వహణపై డాక్టర్లకు సూచనలిచ్చారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ఎంఈఓ కార్యాలయంలో వారధి యాన్యువల్ వ్యాసరచన పోటీలను బుధవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఈఓ–2 బొర్రా వెంకటరత్నం పర్యవేక్షించారు. మండలంలోని పలు ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ


దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు అందిస్తున్న ఎంఈఓలు

కంభం: స్థానిక బోర్డు స్కూల్లోని భవిత కేంద్రంలో బుధవారం మండల విద్యాశాఖాధికారులు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు చేతులమీదుగా దివ్యాంగ విద్యార్థులకు సీపీ చైర్లు, వీల్ చైర్లు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు దివ్యాంగ చిన్నారుల జీవనశైలిపై తల్లిదండ్రులతో చర్చించారు. దివ్యాంగ చిన్నారులతో వ్యవహరించాల్సిన తీరును వివరించారు. ధైర్యం, దిద్దుబాటు చర్యలతో వారిలో దీర్ఘకాలిక మార్పులను సాధించవచ్చని తెలిపారు. అనంతరం ఫిజియోథెరపిస్ట్ సంధ్య చిన్నారులకు శారీరక చికిత్స చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు నూర్జహాన్, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సీఆర్పీలు, ఐఈ ఆర్పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రజకులపై దాడులను అరికట్టాలి


తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న రజక సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: రాష్ట్రంలో రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని రజక సంఘం నాయకులు పాలకవీటి బాలచెన్నయ్య డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస గ్రామంలో రజక కుటుంబంపై దాడి చేసి ఐదుగురిని గాయపరచి, హరమ్మ అనే మహిళను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రజక సంఘ నాయకులు బుధవారం తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రజకుల రక్షణకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ లాంటి చట్టాన్ని తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఆవులమంద శ్రీనివాసులు, ఖాదరయ్య, గోపాల్, శివశంకర్, పాండు, చిన్న అంకయ్య, రమేష్, వేములపాటి చెన్నయ్య, సుబ్బరాయుడు, వెంకటేశ్వర్లు, కమలపాటి చంద్ర, దివాకర్ పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన కేపీ


వైఎస్ జగన్‌తో కేపీ నాగార్జునరెడ్డి

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను వైఎస్ జగన్‌కు వివరించారు.

గిట్టుబాటు ధర లభించడంలేదు

బేస్తవారిపేట: పండించిన పంటలకు గిట్టుబాటు ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు బుధవారం జిల్లా సెరికల్చర్ అధికారి డాక్టర్ సి.సుజయ్‌కుమార్‌ను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో పలు సమస్యలను రైతులు తెలియజేశారు. మిల్లెట్స్ ఎక్కువగా పండిస్తున్నప్పటికీ ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయడం లేదన్నారు. గత ఏడాది కొర్రలు 50 కిలోల బస్తా రూ.4 వేలు ధర ఉంటే ఈ ఏడాది రూ.2 వేలకు అడుగుతున్నారని, దళారులు మరీ అన్యాయంగా తయారయ్యారని రైతులు వాపోయారు. నర్లబర్లీ పొగాకు ఉన్నపళంగా నిషేధిస్తే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కాగా రైతుల ప్రశ్నలకు అధికారుల నుంచి సరైన సమాధానం కరువైంది. సమావేశంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, వ్యవసాయాధికారి అబ్దుల్ రఫీక్, ఏపీఓ గురువరకుమార్ పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులతో కార్మికులకు అన్యాయం


పాఠశాల వద్ద నిరసన తెలియజేస్తున్న సీఐటీయు నాయకులు, బాధితురాలు

గిద్దలూరు రూరల్: రాజకీయ వేధింపులతో పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు అన్యాయం చేస్తున్నారని సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య విమర్శించారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శానిటేషన్ వర్కర్ ఎస్‌కే షాబీరాను అక్రమంగా తొలగించే యత్నాన్ని ఆపాలని బుధవారం పాఠశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టి.ఆవులయ్య మాట్లాడుతూ.. పాఠశాలలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న షాబీరాను టీడీపీ నాయకులు రాజకీయంగా వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల సమావేశం నిర్వహించకుండానే, విద్యాకమిటీలో సభ్యత్వం లేనివారితో సంతకాలు పెట్టించి అన్యాయంగా షాబీరాను తొలగించాలని చూడటం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉందన్న అనుమానంతో స్థానిక టీడీపీ నాయకులు ఆమెపై కక్ష సాధింపులకు దిగడం మంచి పద్ధతి కాదన్నారు. ఇదే తరహాలో మండలంలోని మరికొన్ని పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్లపై రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, ఇటువంటి నీచమైన రాజకీయ చర్యలకు ఉన్నతాధికారులు వత్తాసు పలకకుండా కార్మికులకు అండగా నిలవాలని హితవు పలికారు.

ఆర్థిక అసమానతలపై 'ఏచూరి' అలుపెరుగని పోరాటం


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మూడో వార్డులో సీపీఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ.. పీడిత వర్గాల కోసం పోరాటం చేసిన మహానేత ఏచూరి అని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో, మతోన్మాదానికి, తీవ్రవాదానికి వ్యతిరేకంగా పార్లమెంటు లోపల బయట అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు రూబెన్, జవాజి రాజు, బి.కాశయ్య, ఎస్‌కే నన్నేసా, ఎస్‌కే మహబూబ్ బాషా, కరీముల్లా, నబీ, శ్రీను, జాకీర్, షేక్ ఇనూస్, రెహానా తదితరులు పాల్గొన్నారు.

టైలర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక


పట్టణ టైలర్స్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులు

మార్కాపురం టౌన్:

మార్కాపురం పట్టణంలోని టైలర్లకు అండగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామనిసీనియర్ యూనియన్ నాయకులు నగలపాటి సుబ్బయ్య, నాగిరెడ్డి పేర్కొన్నారు. మృతి చెందిన టైలర్ మిత్రుల కుటుంబానికి మట్టి ఖర్చుల కింద 5 వేల రూపాయలు ఇస్తామని తెలిపారు. పట్టణ టైలర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నికను బుధవారం మార్కాపురం క్లాత్ మర్చంట్ అసోషియేషన్ హాల్లో నిర్వహించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పీవీ కృష్ణారావు, అధ్యక్షుడిగా వడ్డే రాము, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ శ్రీను, ఉపాధ్యక్షుడిగా ఎస్‌కే వలి, సహాయ కార్యదర్శిగా మొహిద్దీన్, ట్రెజరర్‌గా కంచర్ల ధనుష్, కార్యవర్గ సభ్యులుగా పి.మోహన్, పి.శివ, పాలూరి కాశీ, ఎం.కుమార్, ఎస్‌కే జంషీర్ తదితరులను ఎన్నుకున్నారు.

రాష్ట్రీయ రహదారికి మరమ్మతులు


రహదారికి మరమత్తులు నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

కొమరోలు: మండలంలోని అల్లీనగరం గ్రామం వద్ద అమరావతి–కడప రాష్ట్రీయ రహదారిపై గోతులు ఏర్పడటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ×గోతులమయంగా రాష్ట్రీయ రహదారి× శీర్షికన గత నెల 29వ తేదీన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. గత రెండు రోజులుగా రోడ్డుపై గుంతకు మరమ్మతులు చేస్తున్నారు. ఈ భారీ గుంతల వల్ల ఇప్పటివరకు చాలా ప్రమాదాలు జరిగాయని, రోడ్డుకు మరమ్మతులు చేయించేందుకు కృషి చేసిన 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధిపై దృష్టి సారించండి

- మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు


అన్నా రాంబాబును సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో వివిధ పదవులు పొందిన వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. మార్కాపురం 27వ బ్లాక్ ఇన్‌చార్జిగా దాసరి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడిగా బచ్చు సుబ్రమణ్యంను ఎంపిక చేసిన సందర్భంగా పట్టణ అధ్యక్షుడు సలీమ్, పార్టీ నాయకులతో కలిసి అన్నా రాంబాబును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని, ఏ సమస్య వచ్చినా అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వీరారావు, సతీష్, సుబ్రహ్మణ్యం, ఊటుకూరి సురేష్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బొగ్గరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అడ్మిషన్లకు ఫీజుల వసూలు

- పాఠశాలలకు నోటీసులు జారీచేసిన ఎంఈఓ


ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న తల్లిదండ్రులు

కంభం: ఆర్‌టీఈ(12)1సీ చట్టం ద్వారా కేటాయించిన 25 శాతం ఉచిత సీట్లు పొంది యాజమాన్య పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయరాదని మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ సత్తార్ స్పష్టం చేశారు. ఉచిత అడ్మిషన్లు పొందిన తమ పిల్లలను ఫీజులు అడుగుతూ ఒత్తిడి చేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు బుధవారం ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబంధిత పాఠశాలలకు ఎంఈఓ నోటీసులు జారీ చేశారు. ఫీజులు వసూలు చేస్తే పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

రాచర్ల: విధి నిర్వహణలో పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని అనుమలవీడు గ్రామంలోని సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తనిఖీలో తహసీల్దార్ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్రపై వీఓఏలకు శిక్షణ

పొదిలి: మండల కేంద్రమైన పొదిలిలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్(అక్షర ఆంధ్ర)పై వీఓఏలు, వలంటరీ టీచర్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీఏ ఏపీడీ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ.. మహిళల్లో నిరక్షరాస్యులను గుర్తించి, వారికి రాత్రి పూట స్కూల్ నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ శోభన్ బాబు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో పది మంది మహిళలకు ఒక వలంటరీ టీచర్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఉల్లాస్ కార్యక్రమాన్ని విద్యాశాఖ పర్యవేక్షిస్తుందని తెలిపారు. స్త్రీనిధి ఏజీఎం ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. స్త్రీనిధిలో కొత్తగా రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్షరాంధ్ర పుస్తకాలు పంపిణీ చేశారు. ఏపీఎం కె.గోపాలకృష్ణ, ఎల్సీ నాగభూషణం, స్త్రీనిధి మేనేజర్ సులోచన, సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు మెహరున్నీషా, ఓబీ మెంబర్స్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ

పొదిలిలో మంచినీటికి అగచాట్లు


సాగర్ నీటి కోసం క్యూలో పెట్టిన బబుల్స్

పొదిలి: సాగర్ నీటి కోసం పొదిలి పట్టణ వాసులకు రోజూ అగచాట్లు తప్పడం లేదు. దర్శి నుంచి వచ్చే పైపులైన్లు పురాతనమైనవి కావడంతో ఎక్కడో ఒక చోట పగిలిపోయి మెయిన్ లైన్‌లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. మరో వైపు వారానికి రెండు పర్యాయాలు సాగర్‌నీటిని కుళాయిలకు ఇస్తుంటారు. ఒక్కోసారి వారం రోజులు కూడా నీరు రాని పరిస్థితి. దీంతో మంచి నీటి కోసం ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. వైఎస్సార్ సీపీ నాయకుడు కల్లం వెంకట సుబ్బారెడ్డి తన తల్లి లక్ష్మీ దేవమ్మ జ్ఞాపకార్థం శివాయం ఎదురుగా పెద్ద ట్యాంకు ఏర్పాటు చేసి, 24 గంటలు సాగర్ నీరు అందుబాటులో ఉండేలా కుళాయిలు బిగించారు. పాతూరు, విశ్వనాథపురం, కేవీపాలెం, రామ్‌నగర్, బుచ్చనపాలెం, రాజుపాలెం తదితర ప్రాంతాల వారు బబుల్స్‌తో నీరు పట్టుకుని అవసరాలు తీర్చుకుంటున్నారు. నగర పాలక సంస్థ లేదా దాతలైనా విశ్వనాథపురంలో ట్యాంక్ ఏర్పాటు చేస్తే నీటి బాధలు కొంత మేర తప్పుతాయని స్థానికులు కోరుతున్నారు.